సాక్షి ప్రకాశం

శనివారం । 1 । జూన్ । 2024



తల్లీ బిడ్డకు సంపూర్ణ రక్షణ

సరైన వైద్యం అందక ఏ తల్లీ బిడ్డ మరణించ కూడదని, తల్లీబిడ్డల ఆరోగ్యానికి సంపూర్ణ రక్షణ కల్పించాలని వైద్య ఆరోగ్యశాఖ ఇన్‌చార్జ్ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ అన్నారు. - 10లో..



ప్రత్యేక నిఘాతో కౌంటింగ్

జూన్ 4వ తేదీ జరిగే కౌంటింగ్ ప్రక్రియ, కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచి పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. - 10లో..

గరిష్టం/కనిష్టం
44/31

వాతావరణం

ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పొగాకు వేలంలో సరికొత్త రికార్డు

- ఒంగోలు, కొండపిలో రికార్డు ధరలు పలికిన పొగాకు
- ఒంగోలు–1లో గరిష్ట ధర కిలో రూ.338

కొండపి (సింగరాయకొండ): పొగాకు వేలంలో రోజురోజుకూ సరికొత్త రికార్డు ధరలు నమోద వుతున్నాయి. ఇప్పటి వరకు ఐదు రౌండ్ల వేలం పూర్తయింది. శనివారం ఆరో రౌండ్ వేలం ప్రారంభం కానుంది. ఒంగోలు–2 పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం ఈ సీజన్‌లోనే అత్యధికంగా గరిష్ట ధర కిలో రూ.338 నమోదైందని, కొండపి వేలం కేంద్రంలో గరిష్ట ధర రూ.336 వచ్చిందని కొండపి వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. కొండపి వేలం కేంద్రంలో చిన్నవెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాలకు చెందిన రైతులు 965 బేళ్ల తీసుకురాగా 900 బేళ్ల కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 65 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.336, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.265.36 పలికింది. వేలంలో 21 మంది వ్యాపారులు పాల్గొన్నారు. గత సంవత్సరం వేలంలో పొగాకు అత్యధిక ధర రూ.270 వరకు పలికిందని, ఈసారి బోర్డు అధికారుల సూచనల మేరకు రైతులు జాగ్రత్తలు తీసుకున్నారన్నారు. మార్కెట్‌కి అనుగుణంగా గ్రేడింగ్ చేయడంతో నాణ్యమైన పొగాకు రైతులకు అందిందని చెప్పారు. మంచి గ్రేడింగ్ పొగాకు రావడం, పొగాకుకు మంచి డిమాండ్ ఉండడం, వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేయడంతో ఈ సంవత్సరం పొగాకు వేలంలో అత్యధిక ధర లభిస్తోందన్నారు.

ముగిసిన పది సప్లిమెంటరీ పరీక్షలు

ఒంగోలు: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ముగిశాయి. శుక్రవారం జరిగిన సోషల్ పరీక్షకు 1553 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 776 మంది మాత్రమే హాజరయ్యారు. పరీక్షలు పూర్తిగా ప్రశాంతంగా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పూర్తి కావడంపై డీఈవో డి.సుభద్ర సంతోషం వ్యక్తం చేశారు. మరో వైపు మూల్యాంకనం ప్రక్రియ ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రారంభం కానుంది. ఈనెల 2వ తేదీ నుంచి బార్ కోడింగ్ ప్రక్రియ కూడా ప్రారంభించనున్నారు.

ఇంటి నుంచే కొలువుల వేట

ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొత్తదనం సంతరించుకుంది. ఉద్యోగాల్లో ప్రాధాన్యం కోసం తమ విద్యార్హతలతో ఎంప్లాయిమెంట్ కార్యాలయాలకు పరుగులు తీసి, చాంతాడంత క్యూలైన్లలో నిలబడి దరఖాస్తులు చేసుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు రిజిస్ట్రేషన్ ప్రక్రియ స్వరూపంతో పాటు పేరును కూడా మార్చుకుంది. చేతిలో మొబైల్ ఉంటే.. నిరుద్యోగులు ఇంటి నుంచే కొలువులకు దరఖాస్తులతో పాటు కొలువుల వివరాలు తెలుసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ఇక నుంచి నిరుద్యోగులకు వ్యయప్రయాసలు తప్పనున్నాయి.



- ఆన్‌లైన్ విధానంలో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్
- మొబైల్ ఫోన్ ద్వారానే రిజిస్ట్రేషన్లు
- అభ్యర్థులకు తప్పిన వ్యయప్రయాసలు
- ఒకే పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ వివరాలతో పాటుగా ఉద్యోగ ఖాళీల వివరాలు
- పేరు మారనున్న ఎంప్లాయిమెంట్ కార్యాలయాలు
- మోడరన్ కెరీర్ సెంటర్ (ఎంసీసీ)గా మార్పు

ఒంగోలు టౌన్: పూర్వం రోజుల్లో పదో తరగతి పూర్తయితే చాలు వెంటనే ఎంప్లాయిమెంటు రిజిస్ట్రేషన్ కోసం పరుగులు తీసేవారు. అయితే ప్రభుత్వ ఉద్యోగాల నియమాకాలు తగ్గి ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాలు పెరిగిన తరువాత ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేయించేవారి సంఖ్య భారీగా తగ్గింది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంపై దృష్టి సారించింది. ఎంప్లాయిమెంట్ కార్యాలయాల ద్వారా జాబ్‌మేళాలు, నైపుణ్య శిక్షణ శిబిరాలను నిర్వహించడం వంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టడంతో తిరిగి ఎంప్లాయిమెంట్ చేసేవారి సంఖ్య క్రమంగా పెరిగింది. ఇన్ఫోసిస్‌లాంటి పెద్ద కంపెనీలు తీసుకొచ్చి క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించడం, చదువులు పూర్తికాగానే ఏదో ఒక ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగం లభించే ఏర్పాటు చేస్తారు. ఈ క్రమంలోనే ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కోసం ఇప్పటి వరకు అమలులో ఉన్న పాత విధానాన్ని పక్కన పెట్టి ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొచ్చింది. దీంతో రిజిస్ట్రేషన్ సులువవడమే కాకుండా డబ్బుకు డబ్బు, సమయానికి సమయం ఆదా అవుతోంది. అలాగే ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పేరును మోడల్ కెరీర్ సెంటర్లుగా మార్చనున్నారు. త్వరలోనే ఉపాధి కార్యాలయాలు ఎంసీసీ సెంటర్లుగా కీలకపాత్ర పోషించనున్నాయని చెప్పొచ్చు.

అబ్బాయిల రిజిస్ట్రేషన్లే ఎక్కువ...

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక సచివాలయాల ద్వారా 1.36 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. అలాగే కరోనా సమయంలో ప్రభుత్వాస్పత్రుల్లో పెద్ద ఎత్తున సిబ్బందిని నియమించారు. ఈ కారణంగా 2019 నుంచి 2022 వరకు ఎక్కువగా రిజిస్ట్రేషన్లు జరిగాయని తెలుస్తోంది. 2019 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 11,791 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్లలో అబ్బాయిల సంఖ్య ఎక్కువగా ఉంది.

రిజిస్ట్రేషన్ విధానం నాడు..

నిన్నా మొన్నటి వరకు అమలులో ఉన్న మాన్యువల్ విధానాన్ని అరుంధతి రిజిస్ట్రేషన్ విధానం అనేవారు. ఈ విధానం ద్వారా ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు అభ్యర్థి నేరుగా ఎంప్లాయిమెంటు కార్యాలయానికి వెళ్లాలి. ఒరిజినల్ సర్టిఫికెట్లను కార్యాలయంలో చూపించి జిరాక్స్ కాపీలను దాఖలు చేసేవారు. వెంటనే రిజిస్ట్రేషన్ చేసేవారు. మూడేళ్ల తరువాత మళ్లీ రెన్యువల్ చేసుకోవాల్సి వచ్చేది. దీనికి 6 నెలల గ్రేస్ పిరియడ్ ఉండేది. ఈ విధానంలో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కోసం దూర ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు అనేక వ్యయప్రయాసలతో ఇబ్బందులు పడేవారు. జిల్లాలో యర్రగొండపాలెం, పుల్లల చెరువు,

సంవత్సరం	మొత్తం రిజిస్ట్రేషన్లు	అబ్బాయిలు	అమ్మాయిలు
2019	4,259	2,802	1,457
2020	1,649	1,157	459
2021	3,341	2,136	1,205
2022	1,522	923	599
2023	921	564	357
2024లో ఇప్పటి వరకు	99		

దోర్నాల, పెద్దారవీడు, అర్ధవీడు, రాచర్ల, గిద్దలూరు మండలాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా ఇబ్బందులు పడేవారు. తెలవారుజామున బయలుదేరి రెండు మూడు బస్సులు మారి ఒంగోలు చేరుకునేవారు. తిరిగి ఏ అర్ధరాత్రికి కానీ ఇంటికి చేరే పరిస్థితి ఉండేది. అంతేకాకుండా 10వ తరగతి విద్యార్థి అంటే 15 ఏళ్ల బాలుడు, బాలికలు ఉండేవారు కనుక వారిని ఒంటరిగా పంపించేవారుకాదు. తోడుగా ఎవరో ఒకరు వచ్చేవారు. ఇద్దరికి కలిపి బస్సు చార్జీలు, భోజనాల ఖర్చులు కలిసి తడిసి మోపెడయ్యేవి. అదనపు అర్హతలను నమోదు చేయాలంటే కూడా ఒంగోలుకు రావలసి వచ్చేది. అయితే విభిన్న ప్రతిభావంతులకు మాత్రం కొంత వెసులుబాటు ఉండేది. ఒకసారి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే తిరిగి చేయించాల్సిన అవసరం ఉండేది కాదు. తొలిసారి రిజిస్ట్రేషన్‌కే అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఈ నమోదు ప్రక్రియ కూడా జిల్లా కేటగిరీలోని ఉద్యోగాలకే పరిమితమయ్యేది. ప్రొఫెషనల్ కోర్సులు చదివిన వారిని యూనివర్శిటీ పరిధిలోనే రిజిస్ట్రేషన్ చేసేవారు.

మార్కాపురంలో సబ్ సెంటర్...

జిల్లా మొత్తం మీద కేవలం ఒకేఒక్క ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఉండడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చేది. దీంతో జిల్లాకు దూరంగా ఉంటున్న పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురంలో ఒక సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాలు ఉద్యమాలు చేశాయి. దీంతో మార్కాపుంలో సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

నేడు ఇంటి నుంచే రిజిస్ట్రేషన్లు:

మారిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ఇంటి నుంచి బయటకు కాలుకదపకుండా మొబైల్ ఫోన్‌లోనే రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. www.employment.ap.gov.in అనే పోర్టల్‌ను జనవరి 2024న ప్రభుత్వం ఆవిష్కరించింది. దీనిద్వారా మారుమూల ప్రాంతాల విద్యార్థులు సైతం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయవచ్చు. దీనికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదు. ఒంగోలు, మార్కాపురం వెళ్లాల్సిన అవసరం అంతకన్నా లేదు.

నిరుద్యోగులకు వరం ఈ పోర్టల్



ప్రభుత్వం రూపొందించిన ఎంప్లామెంట్ పోర్టల్ నిరుద్యోగులకు వరం లాంటిది. ఈ పోర్టల్‌లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవడమే కాకుండా ఉద్యోగాల సమాచారాన్ని తెలుసుకునే అవకాశం కూడా ఉంది. ఎక్కడ ఏఏ ఉద్యోగాలు ఉన్నాయో, వాటి ఖాళీల వివరాలు సైతం తెలుసుకొని ప్రయత్నాలు చేసుకోవచ్చు. జాతీయ, అంతర్జాతీయ సమాచారం కూడా లభ్యమవుతుంది. ఇది ప్రభుత్వ పోర్టల్ కనుక నిరుద్యోగులకు సమగ్రమైన సేవలు అందజేస్తుంది.

– భరద్వాజ్, జిల్లా ఉపాధి అధికారి.

నమోదు ఇలా..

ఆన్‌లైన్ విధానంలో ఎంప్లాయిమెంటు రిజిస్ట్రేషన్ చేయడానికి ముందు ప్రతి విద్యార్థి ఒక జాబ్ సీకర్ ఐడీని మొబైల్ ఫోన్ ద్వారా క్రియేట్ చేసుకోవాల్సి ఉంటుంది.

- పోర్టల్ క్లిక్ చేయగానే జాబ్‌సీకర్ లాగిన్ వస్తుంది.
- జాబ్ సీకర్‌లాగిన్ క్లిక్ చేయగానే లాగిన్ నౌ అని వస్తుంది. దాని కింద యూజర్ నేమ్ అడుగుతుంది. అక్కడ ఇచ్చిన కాలంలోనే మొబైల్ నెంబర్‌ను కూడా నమోదు చేయాలి.
- పాస్ వర్డ్ కొట్టి క్యాప్చా ను నమోదు చేయాలి.
- న్యూ జాబ్ సీకర్ అని ఆప్షన్ పై క్లిక్ చేయాలి. న్యూ జాబ్ సీకర్ ఐడీ నమోదు చేసుకునేందుకుగాను ఈ మెయిల్, ఆధార్, మొబైల్ నంబర్లను సిద్ధంగా ఉంచుకోవాలి.
- 10వ తరగతి సర్టిఫికెట్ ప్రకారం పేరు తదితర వివరాలు నమోదు చేయాలి. సర్ నేమ్‌లో పూర్తి పేరు రాసి, లాస్ట్ నేమ్ అనే కాలంలో ఇంటిపేరు నమోదు చేయాలి.
- మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్లను అన్నీ ఆప్షన్లలోనూ ఒకేలా ఇవ్వాలి. ఆధార్ నంబర్ కొట్టిన తరువాత క్యాప్చా టైప్ చేసి సబ్‌మిట్‌ను కొట్టాలి. సక్సస్‌ఫుల్ రిజిస్టర్ పక్కన ఓకే కొట్టాలి.
- మళ్లీ హోం పేజీలోకి వచ్చి లాగిన్ నౌ అడుగుతుంది. యూజర్ నేమ్ అడుగుతుంది. పాస్‌వర్డ్ పూర్తి చేసి క్యాప్చా టైప్ చేయాలి. లాగిన్ కొట్టాలి.
- అప్పుడు డాక్యుమెంట్ల వివరాలతో గైడ్‌లైన్స్ పేజీ వస్తుంది. అందులో సూచించిన ప్రకారం డాక్యుమెంట్లను స్కాన్ చేసి దగ్గర ఉంచుకోవాలి.
- ఆ తరువాత అప్లికేషన్ ఫాం ఫ్రం ఫ్రెష్ రిజిస్ట్రేషన్ అనే పేజీ వస్తుంది. అందులోని విషయాలను జాగ్రతగా చదువుకొని నమోదు చేసుకోవాలి.
- నేమ్ ఆఫ్ ది కాండిడేట్ కాలంలో సర్ నేమ్ తో సహా పూర్తి పేరు నమోదు చేయాలన్నది మరచిపోకూడదు.
- ఎస్సీ, ఎస్టీ, బీసీలైతే క్యాస్ట్ సర్టిఫికెట్లను అడుగుతుంది. కనుక సిద్ధంగా ఉంచుకోవాలి.

ఉద్యోగ ఖాళీలు తెలుసుకోవచ్చు..

ఈ ఎంప్లాయిమెంట్ పోర్టల్‌లోకి వెడితే రిజిస్ట్రేషన్ మాత్రమే కాకుండా ఉద్యోగాలకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు. రాష్ట్రంలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎక్కడెక్కడ ఉద్యోగాలు ఉన్నాయి, ఎన్ని ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయో తెలుసుకోవచ్చు. ఇంటర్వ్యూలను సరిగ్గా అటెండ్ చేయలేక పోతున్నామని బాధపడేవారు ఈ పోర్టల్ లోనే కౌన్సిలర్లను సంప్రదించి తగిన సలహాలు, సూచనలు తీసుకోవచ్చు. ఎంప్లాయిమెంట్ న్యూస్ లాంటి పత్రికలు సైతం ఇందులో ఉచితంగా చదువుకునే అవకాశం ఉంది. ఒకరకంగా చెప్పాలంటే నిరుద్యోగులకు ఈ పోర్టల్ ఒక మార్గదర్శిలాంటిది.

పటిష్టంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఏర్పాట్లు

- కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లకు వేర్వేరు గుర్తింపు కార్డులు
- మూడంచెల భద్రతా చర్యలు
- విలేకర్ల సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, పక్కన ఎస్పీ

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జూన్ 4వ తేదీ నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పటిష్టంగా ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రకాశం భవనంలో ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌తో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఒంగోలు పార్లమెంట్‌తో పాటు 8 అసెంబ్లీ సెగ్మెంట్‌లకు రైజ్ ఇంజినీరింగ్ కాలేజిలో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఆయా కౌంటింగ్ కేంద్రాల్లో 14 టేబుళ్ల లెక్కన ఏర్పాటు చేశామని చెప్పారు. ఈవీఎంల కౌంటింగ్ కోసం ప్రతి టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్ టేబుల్ వద్ద ఒక సహాయ రిటర్నింగ్ అధికారి, ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అధికారులు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని వివరించారు. ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ టెక్కింపు కేంద్రాలకు వెళ్లేందుకు సిబ్బంది, ఏజెంట్లకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశామన్నారు. ఏ బ్లాక్‌లో ఏ నియోజకవర్గం లెక్కింపు జరుగుతుందో అందరికీ అర్థమయ్యేలా సైన్ బోర్డులు ఉంచామని చెప్పారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లకు ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద వైద్య శిబిరం, అగ్నిమాపక చర్యలు, తాగునీరు, భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. మీడియాకు ప్రత్యేకంగా ఆడిటోరియంలో ప్రత్యేక మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. రౌండ్ వారీ ఫలితాలు ఎప్పటికప్పుడు ఇచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడు అంచెల భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. దీంతో పాటు సుమారు 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి క్షుణ్ణంగా పర్యవేక్షిస్తామన్నారు. కౌంటింగ్ రోజు జిల్లాలో ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. పూర్తి తనిఖీలతో కౌంటింగ్ కేంద్రాలకు పంపుతారన్నారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. హోటళ్లు, లాడ్జిలు, కళ్యాణ మండపాల్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. కౌంటింగ్ రోజు విజయోత్సవ ర్యాలీలు జరపాలంటే అనుమతి తప్పనిసరి అని తెలిపారు. అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దీనిలో డీఆర్‌ఓ శ్రీలత పాల్గొన్నారు.

రెడ్‌జోన్‌గా కౌంటింగ్ కేంద్రం

- పటిష్ట భద్రత
- జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు
- 156 గ్రామాల్లో పికెటింగ్
- రాజకీయ పార్టీల నేతలు, పార్టీ కార్యాలయాల వద్ద భద్రత పెంపు
- 8 మంది అభ్యర్థులకు సాయుధ ఎస్కార్ట్
- ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్



ఎస్పీ సుమిత్ సునీల్

ఒంగోలు టౌన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు జరిగే కేంద్రాలను రెడ్ జోన్‌లుగా గుర్తించినట్లు ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో భద్రతా ఏర్పాట్ల గురించి పూర్తి వివరాలు వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఒక ఏఎస్పీ, నలుగురు డీఎస్పీలు, సీఏపీఎఫ్, టీఎస్ఎస్‌పీ, ఏపీఎస్పీ అసిస్టెంట్ కమాండెంట్స్‌తో పాటుగా పోలీసు బలగాలతో రైస్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రంతో పాటుగా జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రజలు గుంపులుగా గుమిగూడవద్దని విజ్ఞప్తి చేశారు. కౌంటింగ్ జరిగే రైస్ కళాశాల ముందు రోడ్డును స్టెరైల్ జోన్‌గా ఉంచేందుకు పెళ్లూరు, వల్లూరు గ్రామాల సమీపంలో ఎన్‌హెచ్–16 పై ట్రాఫిక్ మళ్లింపు పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్‌కు వెళ్లే ఏజంట్లు, అధికారులు, అభ్యర్థులు తప్పనిసరిగా ఆర్వో జారీ చేసిన కలర్ కోడ్ ఐడీ కార్డులు ధరించాలని, గుర్తింపు కార్డులను తనిఖీ చేసిన తరువాత మాత్రమే లోపలికి అనుమతిస్తారని చెప్పారు. కౌంటింగ్ ఏజెంట్లకు వల్లూరమ్మ దాబా సెంటర్, అభ్యర్థులకు రైస్ కళాశాల నార్త్ కార్నర్, అభ్యర్థుల రెండో పార్కింగ్ కోసం రైస్ కాలేజీ సౌత్ కార్నర్, ఎన్నికల పరిశీలకులు, అధికారులకు రైస్ కాలేజీ ఎదురుగా, చీఫ్ కౌంటింగ్ ఏజెంట్లు, మీడియా ప్రతినిధుల కోసం పేస్ కాలేజీ, ఏజెంట్ల కోసం హెచ్‌పీ పెట్రోలు బంకు స్థలాలు, మదరసాలో తగినంత పార్కింగ్ ఏర్పాటు చేశారన్నారు. కౌంటింగ్ కేంద్రాన్ని నో స్మోకింగ్ జోన్, నో ఆల్కహాల్ జోన్‌గా ప్రకటించడంతో ప్రాంగణంలోకి ప్రవేశించేవారికి ర్యాండమ్‌గా బ్రీత్ ఎనలైజర్ పరీక్షలను నిర్వహిస్తారని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మీడియా, కమ్యూనికేషన్ గదిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా 156 గ్రామాల్లో పికెటింగ్‌లు...

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా వ్యాప్తంగా అన్నీ సబ్‌డివిజన్ల పరిధిలో 156 గ్రామాల్లో పికెట్స్, మొబైల్ పార్టీలు, క్యూఆర్టీ, స్ట్రైకింగ్ ఫోర్స్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 4 ప్రధాన పట్టణాల్లో 18 మంది రాజకీయ పార్టీల నాయకుల నివాసాలతో పాటుగా 16 పార్టీ కార్యాలయాల వద్ద భద్రత మరింతగా పెంచినట్లు వివరించారు. జూన్ 1 నుంచి 8 మంది అభ్యర్థులకు 1ప్లస్2 సాయుధ ఎస్కార్ట్‌ను, 10 మంది అభ్యర్థులకు 1 ప్లస్ 1 షాడో పార్టీలను కేటాయిస్తారన్నారు. ఒంగోలు, మార్కాపురం, యర్రగొండపాలెం, దర్శి కౌంటింగ్ కేంద్రాల వంటి వ్యూహాత్మక ప్రదేశాల్లో అల్లర్లు, మాబ్ హింసాత్మక చర్యలకు పాల్పడినప్పుడు సత్వరమే స్పందించేందుకు భాష్పవాయువు, రబ్బరు బుల్లెట్లు, రైఫిళ్లతో ప్రత్యేక బృందాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్డన్ సెర్చ్ ద్వారా జిల్లాలో 2 వేల వాహనాలను సీజ్ చేశామన్నారు. శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని 29,048 మందిని బైండోవర్ చేశామని, 256 మందిపై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు వెల్లడించారు. భద్రతను దృష్టిలో ఉంచుకొని పలు గ్రామాలు, రాజకీయ నాయకుల ఇళ్లలో, పార్టీ కార్యాలయాల్లో 185 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసిన వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వెంటాడుతున్న పచ్చమంద పాపం..

- వలంటీర్లపై ఫిర్యాదు చేసి ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుకున్న టీడీపీ నేతలు
- రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఏప్రిల్‌లో సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ
- అయినా సంతృప్తి పడని పచ్చ ముఠాలు
- తప్పనిసరి పరిస్థితి పరిస్థితుల్లో బ్యాంకుల్లో జమ
- నేటి నుంచి జూన్ నెల పింఛన్ల పంపిణీ
- రూ.87.31 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం



ఒంగోలులో మొదటి అంతస్తులో ఉన్న బ్యాంకు మెట్ల వద్ద వృద్ధుల అవస్థలు (ఫైల్)

ఒంగోలు టౌన్: సార్వత్రిక ఎన్నికలను అడ్డంపెట్టుకుని పచ్చమంద చేసిన పాపం వృద్ధులు, దివ్యాంగులు,దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు, మహిళలను వెంటాడుతూనే ఉంది. ఎర్రటి ఎండలో అవస్థలు పడుతూ బ్యాంకులు, ఏటీఎంలు, సచివాలయాల చుటూ తిరగాల్సి వస్తోంది. ఐదేళ్లపాటు ఇంటి గడపదాటకుండా ఫించన్ అందుకున్న వారు నేడు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఎన్నికల కమిషన్‌ను అడ్డం పెట్టుకుని చంద్రబాబు అండ్ కో, ఎల్లోమీడియా పన్నిన పన్నాగం ఫలితంగా ఈ నెల కూడా పింఛన్ దారులు అవస్థలు పడాల్సిన దుస్థితి దాపురించింది. జిల్లాలో మొత్తం 2.91 లక్షల మంది పింఛన్లు తీసుకుంటున్నారు. ఇందులో 2,18,818 మందికి డీబీటీ ద్వారా, 73,150 మందికి ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం మొత్తం రూ.87.31 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. 1 నుంచి 5 వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ జరుగుతుంది. గత నెలలో డీబీటీ ఫెయిల్ అయిన వారికి, 80 ఏళ్ల వయసు పైబడిన వృద్ధులకు ఈ నెల ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. లబ్ధిదారుల్లో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు ఉన్నారు. ఐదేళ్లుగా వీరందరికీ సకాలంలో ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేశారు. వలంటీర్ల ద్వారా ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారుజామున ఇంటి తలుపులు తట్టి మరీ పింఛన్లు పంపిణీ చేశారు. రూ.3 వేల పింఛన్ డబ్బులు వారికి ఎంతో ఉపయుక్తంగా ఉండేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టాకే తమకే క్రమం తప్పకుండా ఇంటి వద్దకే పింఛన్లు తెచ్చి ఇస్తున్నారని అవ్వాతాతలు ఆనందం వ్యక్తం చేయడం చూసి సహించలేక పచ్చ ముఠా రగలిపోయేవారు. తమకు ఒక అవకాశం వస్తే అవ్వాతాతలను మూడు చెరువుల నీళ్లు తాగించాలని ఎదురు చూశారు. ఈలోపు సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. దాన్ని ఒక ఆయుధంగా వాడుకొని అవ్వాతాతలపై కక్షసాధింపులకు దిగింది తెలుగుదేశం పార్టీ. వలంటీర్ల ద్వారా జరుగుతున్న పింఛన్ల పంపిణీని నిలిపేయాలని ఫిర్యాదులు చేయించింది. దాంతో ఇంటింటికీ జరుగుతున్న పింఛన్ల పింపిణీని ఎన్నికల సంఘం నిలిపి వేసింది. ఏప్రిల్ నెలలో సచివాలయాల వద్ద పింఛన్లు పంపిణీ చేశారు. అయితే పింఛన్ల కోసం వచ్చిన అవ్వాతాతలు చంద్రబాబు చేసిన కుట్రలపై తిట్ల దండకం మొదలు పెట్టడంతో జడిసిపోయిన పచ్చ ముఠా మే నెలలో సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ జరగకుండా కుట్రలు చేసింది. అవ్వాతాతలను ఇబ్బంది పెట్టడం ఇష్టం లేకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో బ్యాంకుల ద్వారా పింఛన్ల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. దీంతో మే నెలలో వృద్ధులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు మళ్లీ 1వ తేదీ వచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా 44 డిగ్రీలకు పైగా ఎండలు మండి పోతున్నాయి. ఇంటి నుంచి బయటకు కాలు పెట్టే పరిస్థితి లేదు. కానీ పింఛన్ల కోసం బ్యాంకులకు వెళ్లాల్సి వస్తోంది. తెలుగుదేశం కుట్రలకు ఇప్పటికే రాష్ట్రంలో 33 మంది వృద్ధులు మృతి చెందారు. దీంతో ప్రజల నుంచి పచ్చ ముఠా కుట్రలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చంద్రబాబు ముఠాకు వృద్ధుల ఉసురు తప్పకుండా తగులుతుందని తిట్టిపోస్తున్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డులు

ఒంగోలు: ఎయిడెడ్ ఉపాధ్యాయులకు త్వరలో ఆరోగ్య కార్డులు జారీ కానున్నాయి. 1998 నుంచి ఎయిడెడ్ ఉపాధ్యాయులు అటు మెడికల్ రీయింబర్స్‌మెంట్ లేదా హెల్త్ కార్డులు కావాలంటూ తీవ్రమైన ఆందోళనలు చేస్తున్నారు. కరోనా సమయంలో రాష్ట్రంలో 169 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులు వైద్య సాయం పొందలేక ప్రాణాలు వదిలారు. కారుణ్య నియామకాలకు కూడా నోచుకోని ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలపై గత ఎంఎల్‌సీలు గాదె శ్రీనివాసులు నాయుడు, బచ్చల పుల్లయ్య, ప్రస్తుత ఎంఎల్‌సీలు ఎంవీ రామచంద్రారెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, కల్పలతారెడ్డి శాసనసమండలిలో ప్రస్తావించడంతో ఆరోగ్య కార్డుల మంజూరుకు మార్గం సుగమం అయింది.

జిల్లాలో 412 మందికి జారీ కానున్న ఆరోగ్య కార్డులు:

జిల్లాలో మొత్తం 114 ఎయిడెడ్ పాఠశాలలు ప్రస్తుతం పనిచేస్తున్నాయి. వాటిలో 68 ప్రాథమిక, 8 ప్రాథమికోన్నత, 28 ఉన్నత, 3 ఓరియంటల్ ఉన్నత పాఠశాలలు, 5 ఓరియంటల్ ప్రాథమిక పాఠశాలలు, 2 ఓరియంటల్ ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 813 శాంక్షన్ పోస్టులు ఉండగా ప్రస్తుతం 378 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. 96 నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులు ఉండగా 34 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ పనిచేస్తున్నారు. వీరికి ఎటువంటి హెల్త్ కార్డులు లేవని విద్యాశాఖ నిర్ధారించింది. ఈ మేరకు రాష్ట విద్యాశాఖ అధికారులకు ఈ వివరాలను డీఈవో డి.సుభద్ర పంపించారు. దీనిపై ఏపీటీజీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ ఏపీ టీచర్స్ రాష్ట్ర నాయకులు బి.చిట్టిబాబు, ఎల్‌కే చిన్నప్పలు ఎంఎల్‌సీలతో కలిసి సంయుక్తంగా జరిపిన పోరాటం కారణంగానే ఈ కార్డులు జారీ అవుతున్నట్లు తెలిపారు. హెల్త్‌కార్డుల జారీకి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఏపీటీజీ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

లైంగిక వేధింపులపై విచారణ



ఉద్యోగిని విచారిస్తున్న అధికారులు

మార్కాపురం రూరల్: మార్కాపురం డివిజన్ పంచాయతీ కార్యాలయంలో ఇటీవల ఓ మహిళా ఉద్యోగిని లైంగికంగా వేధించిన విషయమై కలెక్టర్ దినేష్‌కుమార్, డీపీఓ ఉషారాణి ఆదేశాల మేరకు మార్కాపురం డీఎల్‌డీఓ కార్యాలయంలో శుక్రవారం స్థానిక అధికారులు విచారణ చేపట్టారు. విచారణ అధికారులుగా ఎంపీడీఓ తోట చందన, సీడీపీఓ సుశీలాదేవి, ఏపీడీ నిర్మలాదేవి వ్యవహరించారు. మహిళా ఉద్యోగిని పిలిచి విచారించి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఎంపీడీఓ తెలిపారు. ఇప్పటికే సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులును కలెక్టర్ సస్పెండ్ చేశారు. డీఎల్‌పీఓపై కూడా ఆరోపణలు రావడంతో విచారణ జరపనున్నారు.

వడదెబ్బకు ఇద్దరు మృతి

దొనకొండ: తీవ్రమైన వడగాడ్పుల ధాటికి శుక్రవారం దొనకొండ మండలంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. తెల్లపాడు గ్రామానికి చెందిన అంకాల సిద్ధయ్య(62) గొర్రెలను మేపేందుకు వెళ్లి పొలంలోనే సొమ్మసిల్లి పడిపోయాడు. సమీప పొలాల్లో ఉన్న రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సిద్ధయ్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. అలాగే చందవరం గ్రామానికి చెందిన పిల్లి యల్లారెడ్డి(70) గ్రామంలోనే ఉంటూ వడదెబ్బకు గురై సొమ్మసిల్లి పడిపోయి మృతి చెందాడు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

ఒంగోలు: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1 నుంచి 8వ తేదీవరకు నిర్వహిస్తున్నట్లు ఓపెన్ స్కూల్ జిల్లా చైర్మన్ డి.సుభద్ర, కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. పదో తరగతి పరీక్షలకు 6 కేంద్రాలు, ఇంటర్‌కు 10 కేంద్రాలు సిద్ధం చేశారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లతోపాటు 16 సిట్టింగ్ స్క్వాడ్లను నియమించారు. పదో తరగతి పరీక్షలకు 898 మంది, ఇంటర్ పరీక్షలకు 2612 మంది హాజరుకానున్నారు. ఇంటర్ ప్రాక్టికల్స్ మాత్రం జూన్ 10 నుంచి 12వ తేదీ వరకు రోజుకు రెండు షిఫ్టుల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్ల నియామకం కూడా పూర్తయినట్లు తెలిపారు.

తల్లీబిడ్డకు సంపూర్ణ రక్షణ

- ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డా.సురేష్ కుమార్

ఒంగోలు టౌన్: సరైన వైద్యం అందక ఏ తల్లీ ఏ బిడ్డా చనిపోకూడదని, తల్లికి బిడ్డకు సంపూర్ణ రక్షణ కల్పించాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్య సిబ్బంది మీద ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇన్‌చార్జి అధికారి డాక్టర్ సురేష్ కుమార్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం యూపీహెచ్‌సీ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి యూపీహెచ్‌సీలో తప్పనిసరిగా 90 శాతం ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్లు నమోదై ఉండాలని స్పష్టం చేశారు. కాన్పుల కోసం ఆర్ఎంపీ వైద్యుల వద్దకు, ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లకుండా మాతా శిశు వైద్యశాలకు వెళ్లేలా చూడాలని సూచించారు. ఒంగోలులోని మాతా శిశు వైద్యశాలలో అన్నిరకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హై రిస్క్ హిస్టరీ ఉన్న కుటుంబాలకు చెందిన గర్భిణులను ప్రతి 15 రోజులకు ఒకసారి చెకింగ్ కోసం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొని రావాలని ఆదేశించారు. హిమోగ్లోబిన్ 7 శాతం కంటే తక్కువ కాకుండా జాగ్రత్తపడాలన్నారు. ముందస్తుగా హై రిస్క్ గర్భిణుల కుటుంబాలకు చెందిన ఒక రక్తదాత పేరును రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఆరోగ్య శ్రీ కార్డు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. చివరి 3 నెలలు రక్తంలో షుగర్ కంట్రోలులో ఉండేలా జాగ్రతలు తీసుకోవాలన్నారు. ఈడీడీ క్యాలెండర్లో డెలివరీ తేదీని నమోదు చేయాలని, పౌష్టికాహార లోపం కలిగిన చిన్నారులను ఏడబ్ల్యూసీ సెంటర్‌కు పంపించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య సిబ్బంది, యూపీహెచ్‌సీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మార్కాపురంలో దొంగలు హల్‌చల్

- రెండు నివాసాల్లో చోరీ
- రూ.6 లక్షల విలువైన సొత్తు అపహరణ

మార్కాపురం: పట్టణంలోని కొండారెడ్డి కాలనీలో బండారు తిరుపతమ్మ, బత్తుల తిరుపమ్మ నివాసాల్లో దొంగలు పడి రూ.6 లక్షల విలువైన సొత్తును దోచుకున్నారు. బాధితురాలు తిరుపతమ్మ కథనం ప్రకారం.. 74 గ్రాముల బంగారం, 36 తులాల వెండి, రూ.18 వేలు నగదు అపహరణకు గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపారు.

ప్రత్యేక నిఘాతో కౌంటింగ్

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జూన్ 4వ తేదీ జరిగే కౌంటింగ్ ప్రక్రియ, కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచి పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. శుక్రవారం రైజ్ కాలేజిలో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రాంగణంలోకి వచ్చే కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లను పక్కాగా తనిఖీ చేయాలన్నారు. ఎటువంటి గందరగోళం లేకుండా ఎవరు ఎటు వెళ్లాలో సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఎటువంటి సంఘటనలకు తావు లేకుండా పక్కాగా కౌంటింగ్ ప్రక్రియ జరగాలన్నారు. కలెక్టర్‌తో పాటు పలువురు రిటర్నింగ్ అధికారులు ఉన్నారు.

విద్యాప్రదాత సామ్యూల్ జార్జ్



నివాళులు అర్పిస్తున్న మంత్రి సురేష్

మార్కాపురం: జిల్లాలో వెనుకబడిన మార్కాపురం ప్రాంతంలో విద్యాభివృద్ధికి డాక్టర్ సామ్యూల్ జార్జి విశేషంగా కృషి చేసి విద్యాప్రదాతగా నిలిచారని రాష్ట్ర మున్సిపల్, పట్టాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శుక్రవారం డాక్టర్ జార్జి 92వ జయంతి సందర్భంగా ఇంజినీరింగ్ కళాశాలలో వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశంలో పేద విద్యార్థుల అందరికీ కార్పొరేట్, సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో జిల్లాలో మొదటి ఇంజినీరింగ్ కాలేజిని సుమారు 28 సంవత్సరాల కిందటే ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. ఇంకా రాయలసీమ జిల్లాలో పలు చోట్ల బీఈడీ, ఫార్మసి కళాశాలలను ఏర్పాటు చేసి సాంకేతిక విద్యను అందుబాటులోకి తెచ్చారన్నారు. తమ కళాశాలలో చదివిన వేలాది మంది విద్యార్థులు దేశ విదేశాల్లో సాఫ్ట్‌వేర్, ఫార్మసీ రంగాలతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తుండటం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు నైతిక విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యను జార్జి కళాశాలలో అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రాజబాబు, డీన్ మస్తానయ్య, వైఎస్సార్ సీపీ మహిళా నేత రోజ్‌లిడియా, కళాశాల సిబ్బంది, మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

నేటి నుంచి పెరగనున్న టోల్ చార్జీల భారం



మాట్లాడుతున్న గంటినపల్లి

ఒంగోలు టౌన్: బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పెంచిన టోల్ చార్జీలను జూన్ 1వ తేదీ నుంచి అమలు చేయాలని చూస్తోందని, దీని వలన రాష్ట్ర ప్రజలపై రూ.1190 కోట్ల భారం పడనుందని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటినపల్లి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టోల్ చార్జీలను 5 నుంచి 7 శాతం పెంచాలని నిర్ణయించడం దారుణం అన్నారు. రాష్ట్రంలో మొత్తం 72 టోల్ ప్లాజాలు ఉన్నాయని, టోల్ ప్లాజాల గడువు తీరిన తరువాత కూడా కొనసాగించడం ప్రజలను మోసగించడమే అని మండిపడ్డారు. వెంటనే టోల్ ప్లాజాలను మూసేయాలని డిమాండ్ చేశారు. 26 వేల కిలో మీటర్ల మేర హైవేలను ప్రైవేటు సంస్థలకు అప్పగించిందని, దీని వలన ప్రతి 30 కిలోమీటర్లకు ఒక టోల్ ప్లాజా ఏర్పాటయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ టోల్ ప్లాజాలపై నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నియంత్రణ ఉండదని తెలిపారు. ఇదే జరిగితే రానున్న రోజుల్లో ఆటోలు, మోటారు బైకుల నుంచి కూడా టోల్ చార్జీలు వసూలు చేస్తారని అన్నారు. టోల్ చార్జీల పెంపుతో పాటు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ఆలోచనలను ఉపసంహరించుకోకపోతే ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో తంబి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జీవితాలకు పొగపెట్టే ధూమపానం



జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

- ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డా.సురేష్ కుమార్

ఒంగోలు టౌన్: జీవితాలకు పొగపెట్టే ధూమపానంతో జాగ్రతగా ఉండాలని, పొగతాగే అలవాటును మానుకొని పిల్లాపాపలతో సుఖసంతోషాలతో జీవించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్ కుమార్ అన్నారు. శుక్రవారం ఒంగోలు ప్రభుత్వ వైద్యకళాశాలలో జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధూమపానం వలన చిన్న వయసులోనే హార్ట్ అటాక్, పక్షవాతం, క్యాన్సర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులు సోకుతున్నాయని తెలిపారు. యువత పొగాకు ఉత్పత్తులకు బానిసలవడం బాధాకరమని, దీని వలన నరాలు దెబ్బతింటున్నాయని ప్రపంచస్థాయిలో అనేక నివేదికలు తెలుపుతున్నాయని చెప్పారు. పొగాకు వాడకం వలన అనేక రకాల క్యాన్సర్లు ప్రబలుతున్నాయని ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భగీరథి తెలిపారు. అనంతరం వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులతో వైద్య కళాశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. పొగాకు మానాలని, ధూమపానం అలవాటుకు పొగ పెట్టాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నో టుబాకో సిగ్నేచర్ క్యాంపైన్ ప్రారంభించిన డీఎంహెచ్‌ఓ తొలి సంతకాన్ని చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బి.అనిల్ కుమార్, సైకాలజిస్ట్ శ్రీనివాసులు, సోషల్ వర్కర్ రాజేశ్వరి, ఎఫ్ఎల్ఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ ఎడ్యుకేషన్‌లో జరుగుమల్లి హైస్కూలుకు ద్వితీయ స్థానం



జరుగుమల్లి హైస్కూల్ ఉపాధ్యాయులను అభినందిస్తున్న అధికారులు

జరుగుమల్లి (సింగరాయకొండ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కెరీర్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు హెచ్‌ఎం మర్రి శ్రీనివాసరావు తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ యూనివర్శిటీ సహకారంతో చేపట్టిన కెరీర్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులతో ×మై రెజ్యూమే¤ తయారు చేయించగా, దానిని పుస్తక రూపంలో ఈనెల 30వ తేదీ విజయవాడలోని రాష్ట్ర సమగ్ర శిక్ష పీడీ కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ఇంటర్మీడియెట్ విద్యా సంచాలకులు గౌతమ్‌గౌర్ ఆవిష్కరించారు. కెరీర్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు బి.నరసింగరావు, సీహెచ్ విజయభాస్కర్‌ను సత్కరించి అభినందించారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఉపాధ్యాయ బృందాన్ని డీఈఓ సుభద్ర, ఏఎంఓ రమేష్ అభినందించారు.

అనధికారికంగా బ్యార్నీలు నిర్మించొద్దు

టంగుటూరు: టుబాకో బోర్డు అనుమతి లేకుండా రైతులు పొగాకు బ్యార్నీలు నిర్మించవద్దని రీజినల్ మేనేజర్ లక్ష్మణరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన టంగుటూరులో పొగాకు వేలం సరళిని పరిశీలించారు. వివిధ పొగాకు గ్రేడ్లకు లభించిన ధరల వివరాలు తెలుసుకున్నారు. రైతులు అన్ని రకాల గ్రేడ్లను వేలానికి తీసుకురావాలని, బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శీతల గిడ్డంగుల్లో ఉన్న బేళ్లు, వేలానికి తెచ్చిన వాటి వివరాలను బోర్డు అధికారులకు తెలియజేయాలన్నారు. అనంతరం రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు, రైతు నాయకులు, బోర్డు సిబ్బంది ఉన్నారు.

108 డ్రైవర్‌పై బీరు సీసాతో దాడి

- నిందితుడు జనసేన కార్యకర్త
- చింతపిచ్చల ఆట వద్ద ఘర్షణ



అచేతనంగా పడి ఉన్న అబుదావలి



నిందితుడు వేమా గోవింద రమేష్

కురిచేడు: మద్యం మత్తులో ఉన్న జనసేన కార్యకర్త బీరు సీసాతో 108 అంబులెన్స్ డ్రైవర్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటన కురిచేడు మండలంలోని బోదనంపాడు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో బస్‌షెల్టర్ వద్ద జనసేన కార్యకర్త వేమా గోవింద రమేష్ మరికొందరితో కలిసి చింత పిచ్చలతో జిగ్గాట ఆడుతున్నారు. అదే సమయంలో విధులు ముగించుకుని వచ్చిన 108 అంబులెన్స్ డ్రైవర్ అబుదావలి ఆట చూస్తూ ఉన్నాడు. అక్కడున్న వారితో సరదాగా మాట్లాడుతున్న క్రమంలో గోవింద రమేష్ కోపోద్రిక్తుడై అబుదావలిపై ఘర్షణకు దిగాడు. బీరు సీసాతో తలపై కొట్టి, కింద పడేసి గొంతు, ఛాతీపై కాలితో తన్నాడు. అంతటితో ఆగకుండా బీరు సీసా పగలగొట్టి విచక్షణా రహితంగా దాడిచేశాడు. దీంతో అబుదావలికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రైవేట్ వాహనంలో దర్శి వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి ఒంగోలు కిమ్స్ ఆస్పత్రికి, ఆ తర్వాత మంగళగిరి ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అబుదావలి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

చీమకుర్తి: చీమకుర్తి-రెడ్డినగర్ మధ్య శుక్రవారం తెల్లవారుజామునగుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. శరీరం నుజ్జునుజ్జు కావడంతో గుర్తించేందుకు కూడా కష్టంగా ఉంది. సంఘటనా స్థలాన్ని చీమకుర్తి సీఐ దుర్గా ప్రసాద్ పరిశీలించారు. మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. దేవరపాలెం నుంచి ఒక వ్యక్తి కనిపించడం లేదని బంధువులు పోలీస్ స్టేషన్‌కు రావడంతో మార్చురీలో మృతదేహాన్ని చూపేందుకు ఏర్పాట్లు చేశారు. మృతుడి వివరాల కోసం విచారణ చేస్తున్నట్లు సీఐ చెప్పారు.